క్లుప్తంగా

నూతన కార్యవర్గం ఎన్నిక



తిరుమలగిరిలో లక్ష్మణశర్మను సన్మానిస్తున్న అర్చకులు

తిరుమలగిరి : తిరుమలగిరిలోని శుభమస్తు ఫంక్షన్ హాల్‌లో సోమవారం దూప, దీప, నైవేద్య అర్చకుల ఆత్మీయ సమ్మేళనం నిర్వహించారు. ఈ సందర్భంగా నూతన కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. రాష్ట్ర సహాయ కార్యదర్శిగా కాశిలక్ష్మణశర్మ, జిల్లా ఉపాధ్యక్షుడిగా విజయ్‌పాల్ ఎన్నికయ్యారు. ఈ సందర్భంగా ఎన్నికైన సభ్యులను సన్మానించారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ అన్నంభట్ల ఫణికుమార్, జిల్లా కార్యదర్శి మంత్రమూర్తి ప్రసాద్, వాసుదేవ శర్మ, నటరాజు శర్మ పాల్గొన్నారు.

బీఆర్ఎస్ గ్రామశాఖ అధ్యక్షుడు మృతి



నివాళులర్పిస్తున్న నాయకులు

మద్దిరాల : మండల పరిధిలోని జి.కొత్తపల్లి గ్రామానికి చెందిన బీఆర్ఎస్ గ్రామశాఖ అధ్యక్షుడు గంగవెల్లి వెంకటనర్సింహారావు గత కొన్ని నెలలుగా అనారోగ్యంతో బాధపడుతూ సోమవారం మృతి చెందాడు. దీంతో బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు ఎస్ఏ.రజాక్, జెడ్పీటీసీ కన్న సురాంభ వీరన్నగౌడ్ అతడి మృతదేహాన్ని సందర్శించి పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం మృతుడి కుటుంబ సభ్యులను పరామర్శించారు. కార్యక్రమంలో వైస్ ఎంపీపీ బెజ్జంకి శ్రీరాంరెడ్డి, బీఆర్ఎస్ పార్టీ నాయకులు సూరినేని నర్సింహారావు, రాజేంద్రప్రసాద్, బొబ్బిలి ఉప్పలయ్య, ఎంపీటీసీ శిరంశెట్టి వెంకన్న అవిలయ్య, దామెర్ల వెంకన్న, వెలుగు వెంకన్న, రావుల సైదులు, జనార్దన్, కొమరయ్య పాల్గొన్నారు.

సూర్యక్షేత్రంలో సంకీర్తనలు, కోలాటాల ప్రదర్శన



సూర్యక్షేత్రంలో సంకీర్తనలు ఆలపిస్తున్న భక్తరామదాసు భజన కళామండలి సభ్యులు

అర్వపల్లి : తిమ్మాపురంలోని అఖండజ్యోతి స్వరూప సూర్యనారాయణస్వామి క్షేత్రంలో సోమవారం తిరుమలగిరికి చెందిన శ్రీభక్త రామదాసు భజన మండలి ఆధ్వర్యంలో సంకీర్తనలు ఆలపించారు. మహిళా భక్త బృందం నిర్వహించిన కోలాటాల ప్రదర్శన ఆకట్టుకుంది. అనంతరం క్షేత్రంలో స్వామిని దర్శించుకొని ప్రత్యేక పూజలు చేశారు. ఈ కార్యక్రమంలో బృందం మహిళలు నాగమ్మ, సంధ్య, అజిత, సునీత, కల్పన, లింగమ్మ, విజయ, గోవిందమ్మ, పద్మ తదితరులు పాల్గొన్నారు.

నేడు ఇసుక డంప్ వేలం



తాటిపాములలో సీజ్ చేసిన ఇసుక డంప్‌లు

తిరుమలగిరి : తిరుమలగిరి మండలం తాటిపాముల గ్రామంలో అక్రమంగా నిల్వ చేసిన ఇసుక డంప్‌లను రెవెన్యూ అధికారులు సీజ్ చేశారు. ఈ ఇసుక డంప్‌లకు మంగళవారం ఉదయం 11 గంటలకు వేలం పాట నిర్వహించనున్నట్లు తహసీల్దార్ ఎల్.సుధ తెలిపారు.

వాహనాల తనిఖీ



వాహనాన్ని తనిఖీ చేస్తున్న ఎస్ఐ అజయ్‌కుమార్, సిబ్బంది

నడిగూడెం : పార్లమెంట్ ఎన్నికల నేపథ్యంలో సోమవారం మండల కేంద్రంతో పాటు పలు గ్రామాల్లో స్థానిక పోలీసులు వాహనాల తనిఖీలు నిర్వహించారు. ఈ సందర్భంగా స్థానిక ఎస్ఐ జి.అజయ్‌కుమార్ మాట్లాడుతూ.. వాహనాలలో డబ్బు, మాదకద్రవ్యాలు తరలిస్తే చట్టపరమైన చర్యలు తీసుకుంటామన్నారు. ప్రతిఒక్కరూ ఎన్నికల నియమావళి పాటించాలన్నారు. ఆయన వెంట సిబ్బంది ఉన్నారు.

ఘనంగా హోలీ సంబురాలు

సూర్యాపేట, తుంగతుర్తి నియోజకవర్గాల్లోని గ్రామాల్లో హోలీ వేడుకలను ప్రజలు సోమవారం ఘనంగా జరుపుకున్నారు. పల్లె, పట్టణం ఏ వీధిలో చూసినా హోలీ వేడుకలు కనువిందు చేశాయి. చిన్నారులు, యువతీయువకులు, పెద్దలు రంగుల్లో మునిగి తేలారు. హోలీ సందర్భంగా పలుచోట్ల కామదహనం నిర్వహించారు. చిన్నాపెద్దా కలిసి ఆడిపాడుతూ.. రంగులు పూసుకుంటూ సందడి చేశారు.

– సాక్షి నెట్‌వర్క్



సూర్యాపేటలోని 60ఫీట్ల రోడ్డులో హోలీ ఆడుతున్న చిన్నారులు



సూర్యాపేటలోని పటేల్ రమేష్‌రెడ్డి ఇంటివద్ద హోలీ ఆడుతున్న నాయకులు



సూర్యాపేట : అదనపు ఎస్పీ నాగేశ్వరరావుకు హోలీ శుభాకాంక్షలు తెలుపుతున్న టీఎన్‌జీఓస్ యూనియన్ నాయకులు



తిరుమలగిరిలో హోలీ వేడుకల్లో పాల్గొన్న జిల్లా వైద్యాధికారి కోటాచలం, తదితరులు



నాగారంలో హోలీ వేడుకల్లో పాలొన్న యువకులు



నాగారంలో హోలీ ఆడుతున్న యువకులు, గ్రామస్తులు



మద్దిరాలలో హోలీ వేడుకల్లో పాల్గొన్న చిన్నారులు



అర్వపల్లిలో హోలీ ఆడుతున్న చిన్నారులు



జాజిరెడ్డిగూడెంలో హోలీ సంబురాల్లో గ్రామస్తులు



చివ్వెంల : ఉండ్రుగొండలో హోలీ ఆడుతున్న యువకులు



సూర్యాపేటలో హోలీ వేడుకల్లో పాల్గొన్న నాయకులు



పెన్‌పహాడ్ : ధర్మాపురంలో హోలీ ఆడుతున్న మహిళలు



తుంగతుర్తిలో హోలీ ఆడుతున్న యువకులు, చిన్నారులు



ఆత్మకూరులో హోలీ సంబురాల్లో పాల్గొన్న చిన్నారులు



సూర్యాపేటలో హోలీ ఆడుతున్న పట్టణవాసులు



సూర్యాపేటలో గ్రీన్‌క్లబ్ ఆధ్వర్యంలో..



సూర్యాపేటలోని 60ఫీట్ల రోడ్డులో హోలీ ఆడుతున్న చిన్నారులు

కాసర్లపహాడ్ గురుకులానికి మొదటి ప్రాధాన్యం ఇవ్వాలి

అర్వపల్లి : రాష్ట్రంలోని సంక్షేమ గురుకులాలకు సొంత భవనాలు సమకూర్చేందుకు ప్రభుత్వం కార్యాచరణ సిద్ధం చేస్తున్నందున జాజిరెడ్డిగూడెం మండలం కాసర్లపహాడ్ సాంఘిక సంక్షేమ గురుకుల పాఠశాల, జూనియర్ కళాశాలలకు మొదట ప్రాధాన్యం ఇచ్చి నిధులు మంజూరు చేయాలని పీపీఎల్ వ్యవస్థాపకుడు మచ్చ నర్సయ్య సంబంధిత అధికారులకు విజ్ఞప్తి చేశారు. సోమవారం విలేకరులతో మాట్లాడారు. గ్రామంలో ఎస్సీ గురుకులం కోసం 7 ఎకరాల స్థలాన్ని కూడా కేటాయించడం జరిగిందని తెలిపారు. భవన నిర్మాణం కోసం గతంలోనే టెండర్ పిలిచినా పనులు చేపట్టలేదని, ఈసారైనా ఇక్కడ భవన నిర్మాణం చేపట్టి బాలికల ఇబ్బందులు తీర్చాలని కోరారు. ప్రస్తుతం ఇక్కడి పాఠశాలను జిల్లా కేంద్రంలో నడిపిస్తున్నారని చెప్పారు.

కాంగ్రెస్‌లో పలువురి చేరిక



కాంగ్రెస్‌లో చేరుతున్న నాయకులు

అర్వపల్లి : అర్వపల్లి గ్రామ పంచాయతీ ఆవాసం సీతారాంపురం గ్రామంలో సోమవారం పలువురు నాయకులు కాంగ్రెస్ పార్టీలో చేరారు. గ్రామానికి చెందిన బందెల చినవెంకన్న, ఆంజనేయులుతో పాటు పలువురు నాయకులు బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు అనినెడ్డి రాజేందర్‌రెడ్డి సమక్షంలో కాంగ్రెస్‌లో చేరారు. ఈ కార్యక్రమంలో అర్వపల్లి గ్రామ కాంగ్రెస్ అధ్యక్షుడు మేకల రాంబాబు, రిటైర్డు జవాన్ బందెల వెంకటయ్య, తదితరులు పాల్గొన్నారు.

స్నేహితుడి కుటుంబానికి ఆర్థికసాయం అందజేత



ఆర్థికసాయం అందజేస్తున్న స్నేహితులు

నాగారం : మండల పరిధిలోని ఫణిగిరి గ్రామానికి చెందిన మందడి వెంకన్న ఇటీవల అనారోగ్యంతో మృతి చెందాడు. దీంతో 2001–2002 టెన్త్ బ్యాచ్‌కు చెందిన మృతుడి స్నేహితులు సోమవారం ఆయన చిత్రపటానికి నివాళులర్పించారు. బాధిత కుటుంబ సభ్యులను పరామర్శించారు. రూ.37,500 ఆర్థికసాయం అందజేశారు. ఈ కార్యక్రమంలో మృతుడి స్నేహితులు కల్లెట్లపల్లి లాలు, నాతి అశోక్, అంబటి శ్రీను, తీగుళ్ల యాదగిరి, సోమయ్య, నర్సయ్య, సైదులు, ప్రదీప్, వెంకన్న పాల్గొన్నారు.

వృద్ధాశ్రమంలో అన్నదానం

మునగాల : మునగాల మండలంలోని ముకుందాపురం శివారులో గల ఇందిర అనాథ వృద్ధాశ్రమంలో సోమవారం మండల కేంద్రానికి చెందిన వల్లోజు మహేష్ తన జన్మదినం సందర్భంగా వృద్ధులకు, మానసిక దివ్యాంగులకు అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో ఆశ్రమ నిర్వాహకురాలు నాగిరెడ్డి విజయమ్మ, మహేష్ కుటుంబ సభ్యులు, తదితరులు పాల్గొన్నారు.

వైభవంగా సీతారాముల కల్యాణం



ఫణిగిరిలో దేవతామూర్తులను కల్యాణానికి తీసుకెళ్తున్న అర్చకులు



కల్యాణం నిర్వహిస్తున్న అర్చకులు

నాగారం : ఫణిగిరి గ్రామంలోని శ్రీ సీతారామచంద్రస్వామి బ్రహ్మోత్సవాల్లో భాగంగా ఆదివారం రాత్రి స్వామివారి కల్యాణాన్ని వేదమంత్రోచ్ఛరణల మధ్య అంగరంగ వైభవంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయ కమిటీ సభ్యులు, భక్తులు సీతరామచంద్రస్వామికి పట్టువస్త్రాలు, తలంబ్రాలు సమర్పించి, ప్రత్యేక పూజలు నిర్వహించారు. స్వామి వారి కల్యాణానికి మండలంలోని వివిధ గ్రామాల ప్రజలు పెద్దఎత్తున హాజరయ్యారు. ఈ కార్యక్రమంలో ఆలయ కమిటీ చైర్మన్ గట్టు లక్ష్మీకాంత్, దేవాదాయశాఖ కార్యనిర్వహణ అధికారి వై.శ్రీనివాస్‌రెడ్డి, అర్చకులు కె.సంతోష్ కుమార్ ఆచార్యులు, బీజేవైఎం రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు కన్నెబోయిన రాముయాదవ్, ఆలయ కమిటీ సభ్యులు, డైరెక్టర్లు, భక్తులు తదితరులు పాల్గొన్నారు.

ఓటు హక్కును వినియోగించుకోవాలి



చీదెళ్లలో ప్రజలకు అవగాహన కల్పిస్తున్న రూరల్ సీఐ సురేందర్‌రెడ్డి

పెన్‌పహాడ్ : ప్రజలు నిర్భయంగా తమ ఓటు హక్కును వినియోగించుకోవాలని సూర్యాపేట రూరల్ సీఐ సురేందర్‌రెడ్డి అన్నారు. పార్లమెంట్ ఎన్నికల నేపథ్యంలో సోమవారం మండల పరిధిలోని చీదెళ్ల, గాజులమల్కాపురం గ్రామాల్లో ఓటర్లకు ఓటు హక్కుపై అవగాహన కల్పించారు. ఎన్నికల సందర్భంగా ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు తలెత్తకుండా తగు చర్యలు తీసుకుంటున్నట్లు తెలిపారు. గ్రామాల్లో పుర వీధుల గుండా కేంద్ర బలగాలు, పోలీసులు కవాతు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఎస్ఐ పెరిక రవీందర్ తదితరులు పాల్గొన్నారు.

తొగర్రాయిలో కొనసాగుతున్న బ్రహ్మోత్సవాలు

కోదాడరూరల్ : మండల పరిధిలోని తొగర్రాయిలో గల శ్రీసంతాన వేణుగోపాలస్వామి వార్షిక కల్యాణ బ్రహ్మోత్సవాలు కొనసాగుతున్నాయి. ఉత్సవాల్లో భాగంగా సోమవారం ఉదయం దేవతాహ్వానం, మండప పూజలు, భేరీ, హోమ పూజలు నిర్వహించి సంతానం లేని దంపతులకు గరుడ ప్రసాదం అందించారు. మహోత్సవాల్లో భాగంగా ఇక్కడి ప్రసాదం స్వీకరిస్తే సంతానం కలుగుతుందని భక్తుల విశ్వాసం. అందుకే ఈ ఆలయానికి సంతాన వేణుగోపాలస్వామి అని పేరువచ్చిందని నిర్వాహకులు తెలిపారు. ఉత్సవాల్లో భాగంగా రాత్రి ఎదుర్కోళ్లు, దివిటీ ఉత్సవం, స్వామి వారి కల్యాణ వేడుకలను నిర్వహించనున్నట్లు నిర్వాహకులు తెలిపారు. కార్యక్రమంలో ఆలయ చైర్మన్ అమరనాయిని వెంకటేశ్వరరావు, వైస్‌చైర్మన్ యాదా వెంకటేశ్వర్లు, ధర్మకర్తలు యాదా రమేష్, శ్రీనివాసరావు, నరసింహారావు, సురేష్, సభ్యులు నందుల శాస్త్రీ, హనుమంతరావు, సింగరయ్య, ఏడుకొండలు, వీరాబాబు, భక్తులు పాల్గొన్నారు.



హోమం పూజలో పాల్గొన్న భక్తులు

నీటి కోసం తప్పని పాట్లు

- పైప్‌లైన్ పనిచేయక కుక్కడంలో ఇళ్లలోకి చేరని తాగునీరు
- పబ్లిక్ నల్లా వద్ద క్యూలో నిరీక్షించి నీటిని తెచ్చుకుంటున్న జనం
- మరోవైపు సాగునీరు లేకపోవడంతో ఎండుతున్న పంటపొలాలు



కుక్కడంలో తాగునీటిని పట్టుకోవడానికి పబ్లిక్ నల్లా వద్ద గుమిగూడిన ప్రజలు

మద్దిరాల : ఎండల తీవ్రత పెరుగుతుండడంతో గ్రామాల్లో తాగు, సాగునీటి కష్టాలు తప్పడం లేదు. మద్దిరాల మండలం కుక్కడంలోని పలు వార్డుల్లో గత కొన్నిరోజులుగా నల్లా నీళ్ల పైప్‌లైన్ పనిచేయడం లేదు. దీంతో ఇళ్లలోకి నీళ్లు రావడంలేదు. ప్రజలు చాలా దూరం వెళ్లి పబ్లిక్ నల్లాల వద్ద క్యూలో నిలబడి తాగునీటిని పట్టుకోవాల్సి వస్తోంది. పనిచేయని పైపులను బాగు చేయాలని ప్రజాప్రతినిధులను, అధికారులను అడిగినా ఎలాంటి ఫలితం లేకుండా పోయిందని ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా తాగునీటి సమస్యను వెంటనే పరిష్కరించాలని అధికారులను కోరుతున్నారు.

సాగునీటికీ ఇబ్బందే..

మండలంలోని గ్రామాల్లో రైతులకు సాగునీటికి కూడా ఇబ్బందులు ఎదురవుతున్నాయి. మండలంలో రైతులు 13000 ఎకరాల్లో వరిపొలాలను సాగు చేశారు. కానీ తీరా పంట పండే సమయంలో ఎస్సారెస్పీ నీళ్లు రాకపోవడంతో దాదాపుగా 1100 ఎకరాలకు పైగా పంటలు ఎండిపోయే ప్రమాదంలో ఉన్నాయి. ప్రభుత్వం ఎస్సారెస్పీ కాలువల ద్వారా నీటిని ఈ వారంరోజులు నిర్విరామంగా వదిలినట్లయితే పంటలు చేతికందే అవకాశం ఉందని రైతులు అంటున్నారు. ప్రభుత్వం స్పందించి నీటిని అందించి తమ ఇబ్బందులు తీర్చాలని కోరుతున్నారు.

తాగునీటి కష్టాలు



కుక్కడంలోని 2, 3వ వార్డుల్లో తాగునీటి సమస్య తీవ్రంగా ఉంది. గతంలో నల్లాల కోసం వేసిన పైపులలో ఫ్లోరిన్ జామైంది. దీంతో నీటి సరఫరా కావడంలేదు. పాత పైపులు తొలగించి కొత్త పైపులు వేయాలంటే లక్షల్లో ఖర్చు అవుతుందని అధికారులు పట్టించుకోవడం లేదు. ఇప్పటికైనా తాగు నీటి సమస్య లేకుండా చూడాలి.

– ఆకుల లింగయ్యగౌడ్, కుక్కడం గ్రామం

కొత్త పైపులైన్ వేస్తాం



ఇటీవల కొత్త పైపులైన్ కోసం ఎస్‌డీఎఫ్ నిధులు రూ.3లక్షలు మంజూరయ్యాయి. ఈ రెండు మూడు రోజుల్లో ఫ్లోరిన్ ఇరుక్కుపోయిన పైపులను తొలగించి కొత్త పైపులైన్‌ను వేయిస్తాం. బోరు కనెక్షన్ ఇచ్చి తాగునీటి సమస్యను పరిష్కరిస్తాం.

– అఖిల్, ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ

కొత్తగూడెం రోడ్డు బీటీ రెన్యువల్‌కు మోక్షమెప్పుడో..



పూర్తిగా గుంతలమయమైన కొత్తగూడెంరోడ్డు



చెట్లపొదలతో మూసుకుపోయిన రోడ్డు

అర్వపల్లి : జాజిరెడ్డిగూడెం మండలం కొత్తగూడెంరోడ్డు బీటీ రెన్యువల్‌కు నిధులు మంజూరై రెండేళ్లు గడిచినా ఇంతవరకు పనులకు మోక్షం లేని పరిస్థితి ఏర్పడింది. 2022లో ఈరోడ్డు బీటీకి ఎంఆర్ఆర్ ద్వారా రూ.71.10లక్షలు మంజూరయ్యాయి. అర్వపల్లి నుంచి చాకలిగూడెం మీదుగా కొత్తగూడెం వరకు 6 కిలోమీటర్ల దూరం ఉంటుంది. అయితే ఈ రోడ్డు పూర్తిగా బీటీ లేచిపోయి పెద్దపెద్ద గుంతలేర్పడి రాకపోకలకు తీవ్ర అంతరాయం ఏర్పడుతోంది. అయితే బీటీ రెన్యువల్‌కు నిధులు మంజూరు కాగా ఇప్పటికే ఎనిమిది పర్యాయాలు టెండర్ పిలిచారు. కానీ చివరగా సూర్యాపేటకు చెందిన ఓ కాంట్రాక్టర్ పనులు దక్కించుకున్నారు. గత అసెంబ్లీ ఎన్నికల ముందే టెండర్ ప్రక్రియను పూర్తి చేసినప్పటికీ ఇంతవరకు పనులు ప్రారంభించలేదు. ఇప్పటికైనా వెంటనే పనులు ప్రారంభించి తమ కష్టాలు తీర్చాలని రెండు గ్రామాల ప్రజలు కోరుతున్నారు.

శ్రీవేంకటేశ్వరస్వామి కల్యాణం



కల్యాణం నిర్వహిస్తున్న అర్చకుడు

మునగాల : మునగాల మండల పరిధిలోని బరాఖత్‌గూడెం శివారులో గల శ్రీస్వయంభూ వేంకటేశ్వర స్వామి నెలవారి కల్యాణాన్ని సోమవారం ఆలయ కమిటీ ఆధ్వర్యంలో ఆలయ ప్రధాన అర్చకుడు కందాళ శ్రీనివాసాచార్యులు ఘనంగా నిర్వహించారు. గతనెల 24న శ్రీవేంకటేశ్వరస్వామి బ్రహ్మోత్సవాల సందర్భంగా స్వామివారి కల్యాణం నిర్వహించి నెల రోజులు పూర్తికావడంతో ఆచారం ప్రకారం నెలవారి కల్యాణాన్ని నిర్వహించినట్లు ఆలయ ఉత్సవ కమిటీ అధ్యక్షుడు పాలిశెట్టి శ్రీనివాస్ తెలిపారు. ఈ కార్యక్రమంలో పలువురు భక్తులు పాల్గొని వేంకటేశ్వరస్వామికి వస్త్రాలు, ప్రసాదాలు సమర్పించారు.